క్లుప్తంగా

నేలకొరిగిన మొక్కజొన్న పంట

నల్లమాడ: మండలంలోని గత రెండు రోజులుగా కురిసిన ఓ మోస్తరు వర్షంతో పాటు ఈదురుగాలులకు పలు గ్రామాల వద్ద పంటలు నేలకొరిగాయి. నల్లమాడకు చెందిన టి. చంద్రశేఖర్ ఎకరా పొలంలో మొక్కజొన్న పంట సాగు చేశాడు. పంట ఏపుగా పెరిగి కోతకు సిద్ధంగా ఉంది. వారం రోజుల్లో కోతకు వచ్చిన పంట నేలకొరగడంతో తీవ్ర నష్టం వాటిల్లినట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

సమాచారం పొందడం అందరి హక్కు

బత్తలపల్లి: ప్రభుత్వ సంస్థల నుంచి అవసరమైన సమాచారాన్ని పొందడం ప్రజలందరి హక్కు అని ఆర్టీఐ చైతన్య వేదిక సంస్థ మండల ఉపాధ్యక్షుడు మాతంగి కాటమయ్య పేర్కొన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ కాలనీలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాన్యుడు సమాచార హక్కు చట్టం ద్వారా మనకు కావాల్సిన సమాచారాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఆర్టీఐ సభ్యులు అక్కిం కార్తీక్, బండారు అనిల్, మాతంగి విజయ్‌కుమార్, అక్కిం నంద, మాతంగి చంద్రశేఖర్, అక్కిం గిరీష్‌కుమార్, మీనుగ అజయ్, మాతంగి ఫణికుమార్, అక్కిం నిరంజన్, మాతంగి హేమంత్ కుమార్, మాతంగి రామాంజనేయులు, అక్కిం నారాయణ పాల్గొన్నారు.

శుభకార్యం



ముక్తాపురంలో గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

కనగానపల్లి: మండలంలో పలు శుభకార్యాల్లో రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ముక్తాపురంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మద్దా శేఖర్, కళావతి దంపతుల గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు లక్ష్మినారాయణరెడ్డి, రమణారెడ్డి, కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం తగరకుంట సమీపంలో గులగానయ్య కొండపై వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన భానుకోట సర్పంచ్ బాలరాజు సోదరుని వివాహ కార్యక్రమానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడు గంగుల సుధీర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రియాంకనగర్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వన్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. సోమందేపల్లి మండలం మేకలపల్లికి చెందిన రామంజినప్ప, రవి ధర్మవరం వచ్చి తిరిగి స్వగ్రామానికి బయలుదేరారు. ప్రియాంకనగర్ సమీపంలోని వేణు మోటార్స్ పక్కవీధిలో నుంచి అడ్డంగా మరో ద్విచక్రవాహనం వచ్చి వీరి టూవీలర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రామంజినప్ప, రవిలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. రామంజినప్పను అనంతపురం ఆసుపత్రికి తరలించారు. వన్ టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అ'పూర్వ' కలయిక



సమావేశమైన పూర్వ విద్యార్థులు

కదిరి అర్బన్: స్థానిక ఎన్‌జీఓ హోంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల 1988–89 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం సమావేశం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా శ్రీనాథ్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్,క్రిష్ణానాయక్ ,షంషీర్‌తో పాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మస్తాన్, ఫిరోజ్, ఉస్మాన్, నాగేంద్ర పాల్గొన్నారు.


నారాయణమ్మ కాలనీ.. సమస్యలే అన్నీ!

- కొరవడిన కనీస వసతులు
- వర్షం వస్తే చిత్తడి చిత్తడి
- పట్టించుకోని అధికారులు
- కాలనీవాసులకు తప్పని అవస్థలు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని 6వార్డుకు చెందిన కందికుంట నారాయణమ్మ కాలనీలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కనీస వసతులు లేకపోవడంతో కాలనీవాసులకు అవస్థలు తప్పడం లేదు. కాలనీలో దాదాపు 1,000 కుటుంబాలు నివాసముంటున్నాయి. ఇందులో శ్రీరామ్‌నగర్, బాబాకాలనీ, న్యూ అమీన్‌నగర్ ఉన్నాయి. కాలనీ ఏర్పాటై దశాబ్ద కాలం దాటిపోయింది. అయినా కనీస వసతులకు నోచుకోవడం లేదు. కాలనీలో వసతులు కల్పించాలని కాలనీవాసులు ప్రభుత్వ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టిన ఫలితం లేకపోయింది.

మట్టిరోడ్లే దిక్కు..

కాలనీలో ఏళ్ల తరబడి మట్టిరోడ్లే దిక్కుగా మారాయి. సీసీరోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో రోడ్లన్నీ చిత్తడిచిత్తడిగా మారుతున్నాయి. దీంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపై చేరి దుర్వాసన వెదజల్లుతోంది. పారిశుధ్య లోపంతో దోమలు విజృంభించి రోగాలు ప్రబలుతున్నాయి. ఇక తాగునీటి వసతి లేకపోవడంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. కనీసం విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో రాత్రయితే చాలు కాలనీవాసులు కాలు బయటపెట్టలేని దుస్థితి నెలకొంది.



కాలనీలో ఏర్పాటైన మట్టిరోడ్డు



కాలనీలో రోడ్డుపై నిల్వ ఉన్న మురుగునీరు

అంగన్‌వాడీ కేంద్రమూ లేదాయే..

కాలనీలో దాదాపు 300 మంది దాకా చిన్నపిల్లలున్నారు. కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం లేకపోవడంతో పిల్లలు పక్కనున్న అమీన్‌నగర్‌కు వెళ్లాల్సి వస్తోంది. అక్కడకు వెళ్లలంటే ముళ్లపొదలు ఉండడంతో మహిళలు పిల్లలను తీసుకువెళ్లాలంటే భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలో కనీస వసతులు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌ను వివరణ కోరగా కాలనీలో వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి



మాకాలనీలో రోడ్డు, తాగునీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే రోడ్డులో నడవడానికి వీలు కాని దుస్థితి నెలకొంది. రోడ్లపై మురుగునీరు ఉండడంతో దోమలు ప్రబలు రోగాలు వస్తున్నాయి. అధికారులు స్పందించి కాలనీకి రోడ్డు సౌకర్యం కల్పించాలి.
– గాయత్రి, నారాయణమ్మకాలనీ

ధర్నాలు చేసినా పట్టించుకోవడం లేదు



మావార్డులో అన్ని సమస్యలే.. కాలనీలో వసతులు కల్పించాలని ఎన్నోసార్లు ఆర్డీఓ, మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు చేసిన అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాలనీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి. – అమ్ములు, నారాయణమ్మకాలనీ

వైఎస్ జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి

తాడిమర్రి: మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని, ఆయన మరోసారి సీఎం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు అగిలే శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఆదివారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసే నాయకులు, కార్యకర్తలకు అధిష్టానం తగిన గుర్తింపు ఇస్తోందన్నారు. తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీలో చోటు కల్పించిన అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, సహకరించిన మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టీవీ ఆదికేశవరెడ్డి, మీసాల కేశవరెడ్డి, పెద్దకోట్ల బాబు, పరమేశ్వర్, హనుమంతు, రాజశేఖర్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



అగిలే శంకర్‌రెడ్డికి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

ధర్మవరం అర్బన్: ప్రజలకు మెరుగైన వైద్యసేవలను అందించాలని ఆర్డీఓ మహేష్ ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న సేవలపై వైద్యులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డులకు వెళ్లి రోగులతో సమస్యలపై ఆరా తీశారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఎమర్జెన్సీ వార్డును పరిశీలించడంతోపాటు రికార్డులు తనిఖీ చేశారు.



ఎమర్జెన్సీ వార్డును పరిశీలిస్తున్న ఆర్డీఓ మహేష్

విద్యార్థినులపై బాధ్యత మెలగాలి..

బత్తలపల్లి: విద్యాలయాల్లోని విద్యార్థినుల పట్ల బాధ్యతతో వ్యవహరించాలని ధర్మవరం ఆర్డీఓ అలకటూర్ మహేష్ ఉపాధ్యాయులకు సూచించారు. ఆదివారం సంజీవపురం సమీపంలోని కస్తూర్బా బాలికల విద్యాలయంను ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థినులతో వసతి, భోజనం, బోధన ప్రమాణాలపై ఆరా తీశారు. అనంతరం ఉపాధ్యాయ బృందంతో మాట్లాడుతూ విద్యార్థునుల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దన్నారు. విద్యార్థినులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ

కదిరి అర్బన్: మొటుకుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జయరామిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆదివారం పార్టీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ గ్రామానికి చేరుకుని జయరామిరెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రమాదవశాత్తు గాయపడి చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న యువనాయకుడు మాధవరెడ్డిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రూరల్ మండల కన్వీనర్ మణికంఠనాయక్, పట్టణాధ్యక్షుడు బాబ్జాన్, నాయకులు రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జయరామిరెడ్డిని పరామర్శిస్తున్న బీఎస్ మక్బూల్ అహ్మద్

కాంగ్రెస్ సీనియర్ నేత డాక్టర్ రవీంద్రారెడ్డి మృతి

కదిరి టౌన్: పట్టణానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ రవీంద్రారెడ్డి(75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కడపల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.సోమవారం కదిరి మండలం కదిరికుంట్లపల్లి వద్ద ఉన్న ఫాం హౌస్‌లో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



డాక్టర్ రవీంద్రారెడ్డి(ఫైల్)



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మోహన్‌రెడ్డి

ఘనంగా ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

తాడిమర్రి: స్థానిక విలేకర్ల భవనంలో ఆదివారం బీజేపీ నాయకులు ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలను ఘనంగా జరుపు కున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు దేవర రామ్మోహన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు జిల్లా సహకార్య నిర్వాహకుడు శరత్‌బాబు హాజరయ్యారు. ముందుగా వారు భరతమాత, ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు హెగ్డేవార్, ఆర్‌ఎస్‌ఎస్ నిర్వాహకులు శ్రీగురూజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వన్నూర్‌రెడ్డి, అనుగుత్తి రమణ, వెంకటరాముడు, నిడిగల్లు రామాంజినేయులు, చంద్రబాబు నాయుడు,మనోజ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రామగిరి: ఆర్‌ఎస్‌ఎస్ (రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్) శతాబ్ది ఉత్సవాలను ఆదివారం పేరూరులో ఘనంగా నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, జిల్లా ప్రధానకార్యదర్శి అశోక్ మాట్లాడుతూ సమాజంలో ఎదురవుతున్న కులవ్యవస్థను పోగొట్టి.. అన్నికులాల మధ్య ఉన్న అంతరాలను తగ్గించేందుకు పోరాడదామని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో కుటుంబ విలువలను కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కోడి రామ్మూర్తి, గాజుల శ్రీనాథ్, అరవింద్, లోకేష్, మధు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ధర్నాకు తరలిరండి

గాండ్లపెంట: నకిలీ మద్యంపై కదిరి ఎక్సైజ్ కార్యాలయం ఎదుట సోమవారం నిర్వహించే ధర్నాకు మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలి రావాలని మండల కన్వీనర్ గజ్జలరవీంద్రారెడ్డి కోరారు. ఈమేరకు ఆయన ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10 గంటలకు కదిరి వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు.

నేటి నుంచి ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

ధర్మవరం రూరల్: ముచ్చురామి గ్రామంలో సోమవారం నుంచి రెండు రోజుల పాటు అంజనేయస్వామి విగ్రహ పున:ప్రతిష్ఠ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో వున్న ఆంజనేయస్వామి ఆలయాన్ని పునరుద్ధరించి స్వామి వారి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నామన్నారు.

కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్ట్



కరాటే విద్యార్థులకు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందిస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: స్థానిక కళాజ్యోతి సర్కిల్‌లో నున్న జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఏపీ పోలీస్ అకాడమీ కోచ్ మురళీకృష్ణారెడ్డి, కదిరి కరాటే మాస్టర్ అక్బర్ అలి, హ్యూమన్ రైట్స్ నేషనల్ ప్రెసిడెంట్ సుమలత, పీఈటీలు స్వరూప, సరళ విద్యార్థులకు కరాటే బెల్టులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కరాటే మాస్టర్లు ఇనాయత్‌బాషా, నవ్యశ్రీ, ఉదయ్ ఉన్నారు.

స్కూటీ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ధర్మవరం అర్బన్: ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు స్కూటీ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు క్లబ్ సభ్యులు నాగరత్న, రాజేశ్వరి, ఏ లక్ష్మి, సీ లక్ష్మి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7981775785, 9246315315, 7780655406, 8333806922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పంట నమోదు తప్పనిసరి

రామగిరి: పంట సాగు చేసిన ప్రతి రైతూ సచివాలయాల్లోని వ్యవసాయ అధికారులను కలిసి తప్పనిసరిగా పంట నమోదును చేయించుకోవాలని ధర్మవరం ఏడీఏ లక్ష్మేనాయక్ సూచించారు. ఆదివారం మండలంలోని నసనకోటతోపాటు పలు గ్రామాల్లో సాగుచేసిన టమాట, వేరుశనగ, కంది తదితర పంటలను ఆయన వ్యవసాయశాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పంటలసాగుపై పలు సూచనలు, సలహాలను అందజేశారు.

ఇష్టారాజ్యంగా చెట్ల నరికివేత



వేపచెట్టును మిషన్లతో కోస్తున్న దృశ్యం

పుట్టపర్తి అర్బన్: కొత్తచెరువు మండలంలో మరకుంటపల్లికి వెళ్లే దారిలో ఆదివారం భారీ ఎత్తున చెట్లు నరికి వేశారు. కొత్తచెరువు–తలమర్ల రోడ్డు పక్కనే ఉన్న రోడ్డుకు ఇరువైపులా ఉన్న సుమారు 50 కి పైగా చింత, వేప, టేకు చెట్లును నాలుగు మిషన్లతో తొలగించారు. ఇదేమని అడిగే నాథుడు లేక పోవడంతో ఇలా చెట్లు నరికి వేసి డబ్బు సొమ్ము చేసుకుంటున్నారని అటువైపుగా వెళ్తున్న ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

బంజారా సేవా సంఘం జిల్లా కోశాధికారిగా రవీంద్రనాయక్



గాండ్లపెంట: బంజారా సేవా సంఘం జిల్లా కోశాధికారిగా తుమ్మలబైలు పెద్దతండా సర్పంచ్ బుక్యా రవీంద్రనాయక్ ఎన్నికయ్యారు. పుట్టపుర్తిలో ఆదివారం బంజారాల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈసందర్భంగా అఖిల భారత బంజారా సేవా సంఘం అధ్యక్షుడు బాబూరావు చౌహాన్, బంజారా రాష్ట్ర అధ్యక్షులు ఆంజనేయులునాయక్, కార్యదర్శి డి.రమేష్‌నాయక్ ఆధ్వర్యంలో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారని, అందులో తనను జిల్లా కోశాధికారిగా ఎన్నుకున్నట్లు రవీంద్రనాయక్ తెలిపారు. బంజారాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం రాత్రి బుక్కపట్నం మండలం పాముదుర్తిలో గ్రామసభ ఏర్పాటు చేసి సైబర్ నేరాలు, బాల్యవివాహాల నియంత్రణతోపాటు పలు చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఎస్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శివానగర్ రామాలయం వెనుక ఓ ఇంటిపైన ఆదివారం పేకాట ఆడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.5100 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

తాడిమర్రి: మండల కేంద్రం సమీపంలోని ఈద్గా వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓవ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. తాడిమర్రి ఎస్సీ కాలనీకి చెందిన బండారు పెద్దరాజు బైక్‌పై బత్తలపల్లికి బయలుదేరాడు. నిడిగల్లు గ్రామానికి చెందిన తలారి ఓబిలేసు ఐచర్ వాహనంలో వెళుతూ అదుపుతప్పి వెనుకవైపు నుంచి బైక్‌ను ఢీ కొన్నారు. తీవ్రంగా గాయపడిన అతడిని ఎస్ఐ కృష్ణవేణి వచ్చి తన వాహనంలో బాధితున్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. తర్వాత కుటుంబసభ్యులు అతడిని అనంతపురం తీసుకెళ్లారు.